# నమస్కారమండి!

నార్ల
కుసుమకుమారి



"ఏయ్! బుద్ధుందా, లేదా మీకు? ఇంటికి ఎవరైనా వస్తే నమస్కారం చేయాలని తెలియదా మీకు? మళ్ళీ అంతా బి. ఎ. లు, బి. ఎస్‌సి. లు, ఇంటర్‌లూను. సంస్కారం లేని చదువులు ఎందుకే? వాళ్ళంతా ఏమనుకొంటారు? ఫలానా వారి పిల్లలు గర్వపోతులు. నమస్తేలు చెప్పడంకూడా చేతకాదు అని చెప్పి నవ్వుకోరా? ఎన్నిసార్లు చెప్పాను మీకు? ఛీ! ఛీ! మరీ బుద్ధి లేకుండా పోతుంది ఒక్కొక్కళ్ళకి" అని కోపంగా, తీవ్రంగా పిల్లలను మందలించి పార్వతమ్మగారు వంటింటిలోనికి పోయింది. అంతవరకు నిశ్శబ్దంగా ఉన్న విమల, కమల, శ్యామల, రాము, గోపి అమ్మ అటు వెళ్ళగానే ఫక్కున నవ్వేశారు.

గోపి— "అక్కా! భలే స్ట్రాంగుగా ఉన్నది గదూ, అమ్మ ఇచ్చిన డోసు" అని పకపక నవ్వాడు.

అంతలో విమల పెద్దరికంగా— "ఒరేయ్, నోర్మూయ్‌రా బడుద్ధాయ్! అసలు ఇక నుంచి ఎవరైనా ఇంటికి వస్తే ఇంటి గుమ్మంలోనే నమస్తే చేసెయ్యాలి, తెలుసా!" అంది,

"ఆహా! తెలుసు." అందరూ ఏక కంఠంతో పలికారు.

## తెనుగు తమ్ముడు

మూసీ జలాల అలలు తొలకించి
గోదావరీ వారి శీకరాల పులకించి,
కృష్ణా కవోష్ణ వాయువుల పల్లవించి,
పినాకినీ మందాకినీ తీరాల తనియించి,
పూర్ణ సువర్ణముఖి శోభలకు తన్మయించి,
పరిచేల కలిమిచెలి చేలముల
పచ్చందనమ్ము కనులార గాంచి,
హృదయ పర్వమ్ముగా-
అపర గంధర్వమ్ములో-
వీణ తంత్రుల రవళిలా తలపించి-
తొణకు తెనుగు పలుకుల పరవశించి,
విశ్వమేలేటి వెంకన్న అభయమంది
తనిసినాడవు లెమ్ము
తెనుగు తమ్ముడవు.

-భైరవరసు

ఇంతలో అమ్మ — "భోజనాలకు వస్తారా, రారా" అని కేక వేసేసరికి అందరూ గబగబా భోజనాల గదిలోనికి దారి తీశారు.

అసలు పార్వతమ్మగారి కోపానికి కారణం ఏమిటంటే, నిన్న మధ్యాహ్నం భోజనాలు చేసిన తరవాత క్రింద బెడ్‌రూమ్‌లో పార్వతమ్మగారు పడుకున్నారు. ఇంట్లో తలుపులన్నీ వేసి, పిల్లలంతా పైకి చేరారు. నవ్వులతో ఇల్లంతా దద్దరిల్లి పోయింది. కాలేజీ సంగతులు, లెక్చరర్స్‌కి పెట్టిన నిక్‌నేమ్స్, బోయిస్ అల్లర్లు, ఇరుగు పొరుగు సంగతులు, సినీస్టార్స్ గురించి... ఒక్కటేమిటి— రాజకీయాల దగ్గరనుండి పనిమనిషి రంగమ్మ వరకు అన్ని విషయాలు విడవకుండా నవ్వుతూ, తుళ్ళుతూ పెంకులు ఎగరగొట్టేటట్లు బిగ్గరగా మాట్లాడేస్తున్నారు. ఇంతలో క్రిందనుండి పార్వతమ్మగారు—"ఏయ్, పిల్లలూ! ఏమి టా కేకలు? పడుకోవాలా, అక్కర్లేదా? రాత్రి అని లేదూ, పగలని లేదూ—ఎప్పుడూ గోలే. రోహిణీకార్తి ఎండలు మండిపోతున్నాయి కదా! కాస్త నిద్ర పోకూడదూ!" అని అరిచి వెళ్ళి పోయారు.

అప్పటిదాకా గోల చేస్తున్న వాళ్ళు రెండు నిమిషాలు సైలెంటుగా ఉన్నారు. ఇంతలో — "విమలా! మా కాలేజీలో ఒక అబ్బాయి ఉన్నాడులే, అపర రావణా సురుడనుకో— వాడి బుద్ధులూ రావణా సురుడివే! కంటికి కనక ఆడపిల్ల కనబడితే కీ ఇచ్చినట్లు వాగుతూనే ఉంటాడు. వాడిని స్టూడెంట్ అనుకోవాలో, లెక్చరర్ అనుకోవాలో తెలియదు. కొందరు లెక్చరర్స్‌కూడా స్టూడెంట్స్ లాగా ఉంటారు" అని చెబుతున్న కమలను మధ్యలో ఆపి, "అవును గాని, పెద్దక్కా! రావణాసురుడిని నీవు చూశావా? చూస్తే నా క్కూడా చూపిద్దూ!" అని కొంటెగా శ్యామల అడిగింది. "రావణాసురుడిని నేను చూడడమా!" ఆశ్చర్యపోయింది కమల.

ఇంతలో రిక్షా శబ్దం అయింది. బాల్కనీలోనుండి రిక్షా ఏమిటా అని తొంగి చూచిన శ్యామల—"పద్మక్కవాళ్ళు వచ్చారే" అని కిందకు పరుగెత్తింది. ఆ పరుగెత్తడంలో రాము కాలు తొక్కేసింది. ఇంకో సమయంలో అయితే అక్క మీదికి వెళ్ళేవాడే. కాని, ఎవరో వచ్చారన్న ఆనందంలో కాలు సరిచేసుకుని వచ్చేశాడు. అప్పటికే పార్వతమ్మగారు వాళ్ళను ఆహ్వానిస్తున్నారు. పద్మ భర్త ప్రభాకర్ పార్వతమ్మ గారికి— 'నమస్కారం, అత్తమ్మా' అని చెప్పి, సామాను దింపటంలో రిక్షా వాడికి సాయం చేస్తున్నాడు, ఆయన లోపలకు వచ్చిన తరవాత పార్వతమ్మ పిల్లలతో బావకు నమస్కారం చెయ్యమని చెప్పింది. ఒక్క శ్యామల తప్ప ఎవ్వరూ నమస్తే చెప్పలేదు. అందరూ సిగ్గుపడి తప్పుకున్నారు. అందుకే పార్వతమ్మ — "మా పిల్లలకు సిగ్గు ఎక్కువ. ఎవరితోనన్నా మాట్లాడాలన్నా, చెయ్యాలన్నా భయం జాస్తి" అని చెప్పి సర్దేసింది. వాళ్ళు ఆ రాత్రి సినిమాకు శ్యామలను తోడు తీసుకొని వెళ్ళిన తరవాత పార్వతమ్మగారు గయ్‌మంది పిల్లల మీద.

అసలు ఆవిడ బాధ— ముగ్గురు ఆడపిల్లలూ చక్కగా చదువుకుంటున్నారు, అందగత్తెలు. కాని, రేపు పద్మ వెళ్ళి బంధువుల దగ్గర బాబాయి కూతుళ్ళకు గర్వం ఎక్కువ అని చెప్తితే పిల్లల మీద వాళ్ళకి దురభిప్రాయం ఏర్పడు తుందే అని.

సెలవులు అయిపోయి అందరూ స్కూళ్ళకి, కాలేజీలకి వెళ్ళుతున్నారు. జీవితచక్రం యథావిధిగా జరిగి పోతున్నది.

అప్పుడే కాలేజీ వదిలారు. స్నేహితు లందరితో సరదాగా నవ్వుతూ, నవ్విస్తూ, అల్లరిగా రోడ్డంతా తామై నడుస్తూ వస్తున్నారు విమల బృందం. రోడ్డు మీద జనసంచారం అంతగా లేదు. అందుకే ఫ్రీగా మాట్లాడుతూ, గోల చేస్తూ వస్తున్నారు. ఇంతలో సునీత— "ఏయ్, విమలా! రోడ్డుమీద జనసంచారం ఎక్కువగా లేదు కాబట్టి ఏదైనా ఖర్మ కాలి సైకిల్ గాని, బండి కాని వస్తే దారి వదలవద్దే" అని చెప్పింది. అందరూ 'సై' అంటే 'సై' అన్నారు.

రోడ్డంతా అడ్డంగా స్నేహితులు పక్క పక్క నడుస్తూ వస్తున్నారు. ఇంతలో స్కూటర్ శబ్దం అయింది. అంతా జాగ్రత్తగా స్థలం వదలకుండా ఇంకా నెమ్మదిగా నడుస్తూ, కేరింతాలు కొడుతూ వస్తున్నారు. స్కూటరు మీద వస్తున్న యువకుడు ఎంత ప్రయత్నించినా వాళ్ళు దారి వదలడం లేదు. ఇక చేసేది లేక స్కూటర్ ఆపి, "చూడండి, మీరు మాకు. . ." అని ఇంకా ఏమనాలో తోచక నీళ్ళు నములుతున్నాడు. అతడు పిలిచిన పిలుపుకి అందరూ ఆగిపోయి అతని ముఖంలోకి చూశారు. ఇంత మంది ఆడపిల్లలను చూసేపాటికి బెదిరిపోయా డా యువకుడు.

"ఎందుకు పిలిచారు, మిస్టర్?" విమల అడిగింది. "మాకు దారి వదల మని. . ." ఇంక ఆపేశాడు విమల తీక్షణంగా చూసేసరికి.

"దారా? ఎందుకు వదలాలి? అప్పుడు సైన్స్ ఫేర్ చూడడానికి వస్తే ఎంత అల్లరి చేశావు! అటువంటిది మీకు దారి వదలాలా?" కోపంగా చూస్తూ అన్న విమలని చూసి తెల్ల బోయా డా యువకుడు.

స్నేహితులు ఆశ్చర్యపోతూ చూశా రా అబ్బాయి వైపు. నిజమే, గడ్డం మీద పెద్ద మచ్చ ఉంది. దానితో అందరికి కోపం వచ్చింది. జరిగిపోయిన సంఘటన కళ్ళముందు గిర్రున తిరిగింది.

● ● ●

సంవత్సరం క్రితం జిల్లా పరిషత్‌లో సైన్స్ ఎగ్జిబిషన్ చూడ టానికి వెళ్ళారు స్నేహితులంతా కలిసి. ఇంతలో ఎవరో రాసుకు వెళ్ళిపోయారు వాణిని. వాణి బిక్కమొహంతో ఫ్రెండ్స్ వైపు చూసింది. అంతే. ఫ్రెండ్స్ అంతా కలిసి ఆ అబ్బాయిని క్షమాపణ చెప్పు కొనేవరకు వదలలేదు. ఆ అబ్బాయి చిన్నబోయిన మొహంతో వెళ్ళిపోయాడు. మిత్రురాళ్ళంతా నవ్వుతూ, గ్రౌండంతా తిరిగి ఒక చోట కూర్చుని అలుపు తీర్చుకుంటూ ఉంటే, ఇంతలో ఆ అబ్బాయి, ఆ అబ్బాయితో ఈ శ్రీధర్, ఇంకా పది మందికి పైగా స్టూడెంట్స్ వీళ్ళు బయటకు వచ్చేవరకు తెగ అల్లరి చేసి ఏడిపించారు. అప్పుడే ఈ శ్రీధర్ గడ్డంమీద మచ్చ గుర్తు పెట్టుకొని అతడు ఒంటరిగా కనిపిస్తే ఏడిపించాలని వీరంతా అనుకున్నారు.

శ్రీధర్ ఇన్నాళ్ళకి చిక్కాడు.

● ● ●

శ్రీధర్ కంగారుగా చూశాడు విమల వైపు. "ఏం—ఇప్పటికైనా గుర్తు వచ్చిందాండి, హీరోగారూ!" వ్యంగ్యంగా, కటువుగా అడిగింది వాణి. "ఎందుకు గుర్తుండదు? నాయకత్వం వహించింది వీరేకదా! అంత త్వరగా ఎలా మరిచిపోతారులెండి?" వాడిగా అంది వాసంతి.

శ్రీధర్ మొహం కోపంతో కందగడ్డలా తయారైంది. విమలతో— "చూడండి, మిస్! ఆనాడు జరిగిన సంఘటనలో మీ తప్పు లేదంటారా?" ధైర్యం చిక్క బట్టుకొని అడిగాడు శ్రీధర్.

కరెక్టుగా, సూటిగా జవాబిచ్చింది విమల: "అవును."

"ఎందుకు లేదు? మీ రంతా కలిసి కట్టుగా కనిపించిన అమ్మాయి నల్లా కామెంటు చేస్తుంటే, మగపిల్ల లేనా మరి ఊరుకునేది. మీరు రెట్టింపు అల్లరి చేస్తారు. మొదటి తప్పు మీది. మీ తప్పు తెలుసుకోకుండా అనవసరంగా నన్ను రోడ్డు మీద నిందించటం మర్యాదస్తుల లక్షణం కాదు"

"ఆహా! అయితే, పయటకొంగు ఎందుకు లాగారు?" విమల ప్రశ్న.

"మీరు ఎందుకు ఆ అబ్బాయిని కామెంటు చేయాలి — ఎత్తు పళ్ళని?" శ్రీధర్ జవాబు.

"అయితే బ్రదర్, మీ రెండుకు కలగజేసుకోవలసి వచ్చింది?"

"ఎందుకా? స్నేహితుడు కనక. అసలు మీరు ఆడపిల్లలా, ఆది శక్తులా!" అంటుండగానే చెంప ఛెళ్ళు మంది.

విమల రౌద్రాకారం చూసి అందరూ భయపడి పోయారు. "ఊరు కుంటుంటే మితిమీరిపోతున్నావే! అవును, మేము ఆదిశక్తులమే—ఏమం టావు? ఆదిశక్తులట, ఆదిశక్తులు." రౌద్రంగా, ఎర్రబడిన మొహంతో చకచకా వెళ్ళిపోయింది విమల. చెంప పట్టుకొని శిలా విగ్రహంలా నిలబడిన శ్రీధర్‌ని చూస్తూ ఇంకా అక్కడే ఉంటే తమని ఏమన్నా అంటాడేమోనని స్నేహితులంతా విమలని అనుసరించారు. శ్రీధర్ ఎలా ఇంటికి వచ్చాడో అతనికే తెలియదు.

'ఎలాగైనా ఆ అమ్మాయి చేత క్షమార్పణ చెప్పించాలి. ఎలా, ఎలా?' బుర్ర బద్దలు కొట్టుకునేలా ఆలోచిస్తు న్నాడు శ్రీధర్. ఇంతలో—"అన్నయ్యా! అమ్మ పిలుస్తూంది" అనే పిలుపు విని తల తిప్పి చూశాడు. గుమ్మంతో ఎనిమిదేళ్ళ శ్రీదేవి నిలబడి ఉంది. లేచి చెల్లెల్ని ముద్దు పెట్టుకొని అమ్మ దగ్గరకు వచ్చాడు.

"బాబూ, శ్రీధర్! నాన్నగారు ఎక్కడికో తీసుకువెళతా నన్నారు కదా! ఇంత ఆలస్యంగా వచ్చావేం?" కాఫీకప్పు కొడుక్కి అందిస్తూ అడిగారు శాంతమ్మగారు.

"అవునమ్మా! వస్తుంటే దారిలో లేటయింది."

విమల ఇంటికెళ్ళగానే తల్లి—"ఇంత లేట్ అయిందేమిటే ఈ రోజు?" అని అడుగుతూ, "ఊ త్వరగా రా, కాఫీ చల్లారిపోతుంది" అనేసి వెళ్ళి పోయింది.

"ఆది సరేగాని, అక్కా, ఈ రోజు ఒకటి జరిగిందే!"

"ఏమిటి విమ్మా, అని?"

"నువ్వు తిట్టనంటే చెబుతాను."

"విమ్మా! ఎప్పుడైనా నిన్ను అనవ సరంగా తిట్టానా! భయం లేదు, చెప్పు." విమల బెదురుగా చూచింది అక్క వైపు.

"ఫర్వాలేదు, చెప్పు." అక్క గారి లాలింపుతో అంతా చెప్పేసి, భయంగా అక్క మొహంలోకి చూచింది విమల.

"ఏమిటి, ఆ అబ్బాయిని కొట్టావా?" కళ్ళు పెద్దవి చేసి, ఆశ్చర్యంగా అడిగింది కమల. "అవునక్కా! ఆ అబ్బాయి ఆదిశక్తే అనేసరికి కోపం వచ్చి..." ఇంక ఆపేసింది విమల. కమలకి చెల్లెల్ని మింగేయాలన్నంత కోపం వచ్చింది.

"ఛీ ఛీ! సిగ్గు లేదూ నీకూ? ఫ్రెండ్స్ అందరి ముందు ఆ అబ్బాయిని పట్టుకొని కొడతావా నువ్వు? ఇప్పటి కయినా మించిపోయింది లేదు. రేపు ఆ అబ్బాయి కనిపిస్తే అందరి ముందు క్షమార్పణ కోరు—తెలిసిందా?" కోపంతో మండిపడుతూ అంది కమల. 'అక్కా!' బేలగా చూసింది విమల.

విమల చాలా సేపు వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ అబ్బాయి ఎంత బాధ పడుతున్నాడో అని బాధ పడింది. తన ప్రవర్తనని తిట్టుకుంది. తొందరపడి కొట్టకుండ ఉండవలసింది. ఇలా పిచ్చి పిచ్చి ఆలోచనలతో తెల్లవార్లూ నిద్ర లేకుండా గడిపేసింది.

తెల్లవారి—"ఆదేమిటమ్మా! కళ్ళు ఎర్రగా ఉన్నాయి? జ్వరమా? ఏదీ, ఒళ్ళు చూడనీ. . . అబ్బా! ఎంత వేడిగా ఉందో! కాలేజీ మానేసేయ్" అని చెబుతున్న తల్లి మాటను కాదని త్వరగా కాలేజీకి వెళ్ళటానికి తయారవుతూంది. ఇంతలో క్రిందనుండి నాన్నగారి పిలుపు వినిపించి వెళ్ళింది. అప్పటికే అమ్మ, అక్క శ్యామల, గోపీ, రాము అందరూ అక్కడ ఉన్నారు. వారిమధ్య ఒక అపరిచిత వ్యక్తి కూర్చుని ఉన్నారు. ఆయనని చూడగానే గౌరవభావం కలిగిన విమల రెండు చేతులూ ఫాలభాగం మధ్య చేర్చి చక్కగా, చిరునవ్వు నవ్వుతూ నమస్కరించింది. అంత క్రితం తండ్రి పిలిచి పరిచయం చెయ్యగానే నమస్కరిం చారు, మిగతావారు. కాని, విమల పరిచయం చెయ్యక క్రితమే నమస్కారం చేయటం చూచి ఆయన చాలా సంతోషపడి, "సుఖీభవ!" అని ఆశీర్వదించారు. "ఈ అమ్మాయే మా అమ్మాయి— పేరు విమల, బి. ఎ. రెండవ సంవత్సరం చదువుతూంది" అని చెప్పి, "అమ్మా, విమలా! ఇతడు నా బాల్యస్నేహితుడు. ఇద్దరం మళ్ళీ కలిశాం. నీకు అయిదేళ్ళు వచ్చేవరకు అంతా కలిసే ఉండేవాళ్ళం. వాడేమో హైదరాబాదులోనే స్థిర పడ్డాడు" అన్నారు.

"అయితే, అంకుల్ అన్న మాట మీరు!"

"అవునమ్మా! చిన్నప్పుడూ ఎప్పుడు మా ఇంట్లో ఉండే దానివి. కాని, అప్పుడు మరీ చిన్నదానివి కనక గుర్తు లేదు" అని చిరునవ్వుతో జవా బిచ్చాడు ఆయన.

పిల్లలకి గోపాలం మామయ్య (అంకుల్) హైదరాబాదులో ఉన్నాడనే తెలుసు గాని, చూచే అవకాశం ఇప్పుడే కలిగింది. ఇక ముందు కూడా వీరు ఇంక ఇక్కడే ఉంటారని అందరికీ ఆనందంగా ఉంది.

ఆయన సరదాగా అప్పటి విషయాలు, ఈ మధ్య కాలంలోని మార్పులు చెబు తున్నారు. పిల్లలంతా (కమల తప్ప) స్కూళ్ళకి, కాలేజీలకి వెళ్ళిపోయారు.

"గోపీ, శ్యామల ఏంచదువుతున్నారు?"

"గోపి ఇంటర్, శ్యామల తొమ్మిది, రాము నాలుగు చదువుతున్నారు."

"ఇంతకీ పెద్దమ్మాయికి పెళ్ళి సంబం ధం కుదిరిందని వ్రాశావ్."

"అవునురా! ఆ అబ్బాయి ఎలక్ట్రికల్ ఇంజనీరు. మంచి ఆస్తిమంతుడు. బాగానే ఉంటాడు. కమలని చూచి ఇష్టపడ్డాడు. ఆ అబ్బాయి ఒక్కడే కొడుకు వాళ్ళకి. వాళ్ళందరికి కమల నచ్చింది. కట్నం అయిదు వేలు అడిగారు. సరేనన్నాను. విమల పెళ్ళి, కమల పెళ్ళి రెండూ ఒకేసారి చేయాలని ఉంది, ఖర్చు కలిసి వస్తుంది కదాఅని. కాని, దీనికి ఇంకా ఏదీ చూడలేదు. మరి దైవ నిర్ణయం ఎలా ఉందో!" అని నిట్టూర్చారు.

"ఊహూ!" అని విని ఊరుకున్నారు గోపాలరావుగారు. "రేపు మీ రంతా మా ఇంటికి రావాలి. అక్కడే రేపు ఉండి పోవాలి."


"ఆదేమి టన్నయ్యా! ఈ ఊరికి కొత్తగా వచ్చింది మీరు. మరి వదినని, అబ్బాయిని, అమ్మాయిని తీసుకొని రేపు మీరు రండి."

"అహా! ఆదేమీ లేదమ్మా! మరి మరీ చెప్పింది శాంత, రేపు మిమ్మల్ని రమ్మని. రాకపోతే ఊరుకోదు. తప్పక రావలసిందే."

"సరే! వస్తాం లెండి!" అనేసి పార్వతమ్మగారు భోజనాల ఏర్పాటు చూడ టానికి వెళ్ళిపోయింది. భోజనం చేసి, రేపు తప్పకుండా రమ్మనమని చెప్పి వెళ్ళి పోయా రాయన.

• • •

విమల సాయంత్రం కాలేజీ వదిలాక, ఒక్కతే బస్‌స్టాప్ వద్దకు వచ్చింది. ఎంతకూ బస్ రాలేదు. తన తోటిపిల్లలు విసుగు వచ్చి రిక్షాల్లో వెళ్ళిపోయారు. విమల ఒక్కతే బస్ కోసం చూచి చూచి విసుగు చెంది ఒక్కతే మెల్లగా నడవడం ప్రారంభించింది. ఇంతలో స్కూటర్ శబ్దం విని తల తిప్పి చూచింది. నిన్నటి అబ్బాయి పక్కనే ఉన్న పార్కులోనికి పోతున్నాడు. అంతే! విమల ఒక్క క్షణం ఆలోచించింది. నిజమే! అతడు ఒంటరిగా ఉన్నాడు. వెళ్ళి, క్షమార్పణ కోరితే



ద్వారపాలకులు...
ఫొటో—ఎస్. రామయ్య (హైదరాబాదు)

అమ్మో! ఆ అబ్బాయి ఏమన్నా అంటా డేమో! అయినా సరే, ఈ అవకాశం జార విడుచుకోకూడదు. తప్పు చేసినప్పుడు సిగ్గు పడటం దేనికి? ధైర్యం కూడదీసు కుని మెల్లగా పార్కు లోనికి ప్రవేశిం చింది. ముఖానికి పట్టిన చెమటను మెల్లగా తుడుచుకుంటూ, తల ఎత్తి నలు మూలలా చూచింది. ఆ అబ్బాయి ఒక చోట కూర్చోటానికి కర్చీఫ్ పరుచు కుంటున్నాడు. జారిపోతున్న ధైర్యాన్ని కూడదీసుకుంటూ అటు మెల్లగా అడు గులు వేసింది విమల. ఆ అబ్బాయి ఎందుకో ఇటు తిరిగిన వాడు విమలని చూచి విగ్రహంలా ఉండిపోయాడు.

"నమస్తే!" మెల్లగా అంది విమల.

శ్రీధర్ పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. "అబ్బ! నిన్న అంత ఘాటుగా సత్కరించి ఈ రోజు నమస్తేలు చెబుతున్నా రేమిటి! కొంప దీసి ఈ చెంపనుకూడా సత్కరించేస్తా రేమిటి!" చిలిపిగా కంటి కొసల నుండి నవ్వుతూ కొంటెగా అడిగాడు శ్రీధర్.

"క్షమించండి! నిన్న ఆవేశంలో మిమ్మల్ని కొట్టాను. ఇంటి కెళ్ళిన తరవాత అక్క బాగా తిట్టింది. మిమ్మల్ని కలుసు కొని క్షమార్పణ చెప్పమంది." అమాయ కంగా పరాయి వ్యక్తి అనే భావం లేకుండా ఉన్నదున్నట్టు చెబుతున్న విమలని చూస్తూ ఉండిపోయాడు శ్రీధర్.

సన్నగా, పొడవుగా, తెల్లటి రంగు, కోలముఖం, చిన్న నోరు, సంపంగి వంటి నాసిక, ఎర్రటి పెదవులు, పెద్ద కళ్ళు, హరివిల్లుగా వంగిన కనుబొమలు, చిన్న గడ్డం, నొక్కుల నొక్కుల జుట్టును రెండు జడలుగా వేసుకొని, గులాబీరంగు చీర, అదే రంగు జాకెట్ వేసుకొని అందాల రాణిగా వెలుగొందే విమలను రెప్ప వేయకుండా చూస్తున్నాడు శ్రీధర్.

'అదేమిటి! ఈ అబ్బాయి ఇలాగ చూస్తాడు! అక్క చెప్పిన భావాలు ఏమీ ఈ అబ్బాయిలో లేవే? ఎంత అందంగా ఉన్నాడు! అబ్బ! ఎంత కొంటెగా చూస్తున్నాడో!' విమల ఒళ్ళు ఝల్లు మంది. కంగారుగా ఆ అబ్బాయి వైపు చూచింది. ఆ అబ్బాయి ఏమీ మాట్లాడటం లేదు. బుద్ధి గడ్డి తిని వచ్చింది తను అనవసరంగా. ఇతని వరస చూస్తుంటే ఏమీ బాధ పడు తున్నట్లు లేదు. ఇంకా ఇక్కడ ఉండడం పరువు తక్కువ అని భావించి, వెళ్ళిపోవ డానికి గాను రెండడుగులు వేసింది విమల. నిద్రలోంచి మేల్కొన్న వాడిలా ఉలిక్కి పడి, "అదేమిటి, వెళ్ళిపోతున్నారేం? రండి, కూర్చోండి" అన్నాడు శ్రీధర్.



సత్త్వం

ఫొటో—ఎమ్. వెంకటేశ్వర్లు (సికిందరాబాదు)

"లేదండి, వెళ్ళిపోవాలి" అన్న విమలని చూస్తూ, "కొంచెం సేపు కూర్చోండి. మీ వంతు క్షమార్పణ అయింది, మరి నా వంతో!" చిలిపిగా అన్నాడు శ్రీధర్. ఇంక నిలబడే ఓపిక లేక ఆ అబ్బాయికి కాస్త దూరంలో కూర్చుంది విమల. గాలికి చెలరేగే ముంగురులు సర్దుకుంటూ అతని మాటల కోసం ఎదురుచూడ సాగింది.

"చూడండి, మిస్టర్ ..." ఇంకా ఏమో అనబోతుండగా, "శ్రీధర్!" అని అందించాడు.

"చూడండి, శ్రీధర్! నిన్న నేను చేసిన పనికి పశ్చాత్తాప పడి క్షమించమని అడగడానికి వచ్చాను. కాని . . ." ఆగి పోయింది.

"ఆగిపోయారేం, చెప్పండి! నిజమే! నిన్న మీరు కొట్టిన దెబ్బకి చాలా బాధ పడ్డాను. మిమ్మల్ని ఎలాగైనా అవమాన పరచాలని అనుకున్నాను. కాని, ఎందుకో మీపై ఎంత కోపం తెచ్చుకుందామన్నా కోపం రాలేదు. బహుశా, మీ అందమైన రూపం నా మనస్సులో హత్తుకుపోవటమే కారణ మనుకుంటాను. అందుకే మిమ్మ లను ఏమీ అనలేక పోతున్నాను." కళ్ళలో కొంటెదనం మెరుస్తుండగా సీరియస్‌గా చెబుతున్నట్లు చెప్పేశాడు.

ఆ మాటలు విని చివ్వున లేవబోయిన విమలని చెయ్యి పట్టుకొని కూర్చో బెట్టాడు. ఉగ్రంగా చూసిన విమలని చూచి చెంప తడుముకుంటూ చిలిపిగా, "మళ్ళీ కొడతారా! అదేం వీల్లేదు. ఈ సారి కొడితే మీ నాన్నగారి దగ్గరకు వెళ్ళి 'మీ అమ్మాయి నా హృదయం దొంగిలించింది. అది ఇవ్వమని అడిగితే రెండే రెండు చెంపదెబ్బలు వేడివేడిగా ప్రసాదించింది, కనక మీరు నా హృదయా న్నిప్పిస్తారో, మీ అమ్మాయి నిస్తారో చెప్పండి' అని అడుగుతాను." శ్రీధర్ బింకంగా, సూటిగా విమల కళ్ళలోనికి చూస్తూ, వచ్చే నవ్వు ఆపుకుంటూ పలికాడు.

అంతే! విమల విసురుగా అక్కడి నుండి పారిపోయి వచ్చింది. ఎదురుగా వస్తున్న రిక్షా నిలిపి ఇంటి అడ్రెసు చెప్పి కూర్చుంది. కళ్ళమ్మట కారే కన్నీళ్ళని కర్చీఫ్‌తో తుడుచుకుంటున్న విమలని చూచి శ్రీధర్ బాధపడ్డాడు, అనవసరంగా బాధ పెట్టానే అని.

పొద్దుట నాన్నగారు — "పరమేశ్వరం మామయ్య వాళ్ళు రేపు మనింటికి వస్తారురా! వాళ్ళ ఆల్బమ్ మా పిల్లలు చూస్తారని తెచ్చాను. ఇదిగో, ముగ్గురు ఆడపిల్లలు -ఎంత అందంగా ఉన్నారో" అని నాన్నగారు ఇచ్చారు. అందులో ఈ అమ్మాయి ఫోటో చూచి నిశ్చేష్టు డయ్యాడు తను. నాన్నగారు అన్ని విషయాలు చెబుతూ, "ఈ అమ్మాయి కమల, తరవాతది పేరు విమల -ఎంత చక్కగా మాట్లాడుతుందో తెలుసా!" విమల ముందే తెలిసి ఉండటంతో శ్రీధర్ వినువుగా ప్రవర్తించాడు. ఈ విషయాలు తెలియని విమల ఏడ్చేసింది. ఎలాగైనా రేపు విమలని ప్రసన్నం చేసుకోవాలి అనుకుని ఇంటి ముఖం పట్టాడు శ్రీధర్.

ఇంటి కెళ్ళినదే విమల గది తలుపులు వేసేసి పక్కమీద పడి చాలా సేపు ఏడ్చింది. మనస్సు వికలం కాగా చాలా సేపు ఏడుస్తూ పడుకొంది. అంతలో పార్వతమ్మగారు కాఫీ తీసుకుని ఆదుర్దాగా వచ్చారు. పొద్దుటి నుండి ఏమీ తినలేదు. జ్వరం ఎలా ఉందో అనుకుంటూ కొత్త ప్యూన్ చేత టిఫిన్ పంపిస్తే వాడు విమల ఎక్కడ ఉంటుందో తెలీక వచ్చాడు. అందుకే ఆవిడ ఆదుర్దాగా కూతురి దగ్గరకు వచ్చి తలుపులు తోసి లోపలకు వచ్చారు. విమల మెడ కింద, నుదుటి మీద చెయ్యి వేసి "అయ్యో! జ్వరంగా ఉందే, తల్లీ! లే, కాఫీ తాగు. ఎక్కు వయింది కదూ జ్వరం, పొద్దున కాలేజీ మానేయమంటే మానేయకపోతివి" అంటూ కూతురి చేత కాఫీ తాగించారు. డాక్టర్ వచ్చి ఇంజెక్షన్ చేసి, మందులు రాసిచ్చి వెళ్ళారు. కాని, విమలకి ఇదేమీ తెలియదు. తెల్లవారి మెలకువ వచ్చిన విమల మెల్లిగా కళ్ళు తెరిచి చూసింది. కమల పక్కలో కూర్చొని ఉంది. "విమ్మా! నా మీద కోపం వచ్చిందా?"

"లేదక్కా!" నీరసంగా ఉంది విమల గొంతు.

"మరి నిన్న కాలేజీనుంచి రాగానే నాతో మరెందుకు మాట్లాడలేదు?"

"ఏమో, తలనొప్పిగా ఉండి పడు కున్నాను. అంతే! ఇప్పుడే మెలకువ వచ్చింది."

"అవునే. నీకు చాలా జ్వరం వచ్చింది. రాత్రి డాక్టరుగారు పన్నెండు వరకు ఉన్నారు." వారు అలా మాట్లాడు తుండగానే డాక్టరుగారు గదిలోనికి వచ్చారు. విమలని చూచి పరీక్ష చేసి ఈ

